## పర్మినెంట్ చేయాలని జీపీ కార్మికుల ధర్నా



తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామ పంచాయతీ కార్మికులు ఆందోళన బాటపట్టారు. బుధవారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ఎదుట పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్మికులను పర్మినెంట్ చేయాలని లేకపోతే సమ్మెకు సిద్ధమంటూ హెచ్చరించారు. – నాగర్‌కర్నూల్

## బస్సుల కోసం రోడ్డెక్కిన విద్యార్థులు



ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడపాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం గాంధీనగర్‌లో విద్యార్థులు బుధవారం రోడ్డెక్కారు. సరిపడా బస్సులు రాక, వచ్చిన బస్సులు ఆపక రోజూ తాము సమయానికి పాఠశాలలకు చేరుకోలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తూ కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై బైఠాయించారు. –లింగంపేట

## ఉపకార వేతనాల కోసం రాస్తారోకో




పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకారవేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. – అచ్చంపేట

## 8లోగా డీఎస్సీ-2008 తుది జాబితా

### జిల్లాలవారీగా అధికారులకు బాధ్యతలు

హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): డీఎస్సీ-2008 బాధితులకు ఉద్యోగాలిచ్చే ప్రక్రియ వేగవంతమైంది. అభ్యర్థుల తుది జాబితాను రూపొందించే పనిని పాఠశాల విద్యాశాఖ చేపట్టింది. ఇందుకు ఉమ్మడి జిల్లాలవారీగా ఉన్నతాధికారులకు బాధ్యతలు అప్పగించింది. ఈ నెల 8లోపు అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించి, తుది జాబితాను తయారుచేసి పంపాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి ఉత్తర్వుల్లో ఆదేశించారు. 9 ఉమ్మడి జిల్లాలకు 9 మంది ఉన్నతాధికారులను పరిశీలకులుగా నియమించింది.

## గ్రూప్-4 ఫలితాలు విడుదల చేయండి

హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): గ్రూప్-4 తుది ఫలితాల కోసం అభ్యర్థులు వినూత్నంగా నిరసన వ్యక్తంచేస్తున్నారు. పరీక్ష జరిగి ఇప్పటికీ 500 రోజులు పూర్తికావొస్తున్నా నియామకాలు పూర్తికాకపోవడంతో అభ్యర్థులు లేఖల(లెటర్ క్యాంపెయిన్) ద్వారా నిరసన వ్యక్తంచేస్తున్నారు. తక్షణమే సెలెక్షన్ లిస్టును విడుదల చేయాలని లేఖ ద్వారా టీజీపీఎస్సీ అధికారులను కోరారు.

## బీటెక్ సీట్ల పెంపునకు ముకుతాడు

### కోర్సుల మార్పిడికి ముందుగానే సర్కార్ అడ్డుకట్ట

హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఇష్టారీతిన బీటెక్ సీట్ల పెంపు, కోర్సుల కన్వర్షన్‌కు ముందుగా ముకుతాడు వేసే దిశలో కసరత్తు జరుగుతున్నది. డిమాండ్ ఉన్న కోర్సుల్లో సీట్ల పెంపు, కోర్ కోర్సుల మూసివేతకు బ్రేకులు వేసే యోచనలో ప్రభుత్వమున్నది. నిరుడు 9వేల సీట్ల కోసం కాలేజీలు దరఖాస్తు చేసుకోగా, జేఎన్టీయూ ఎన్వోసీ ఇవ్వగా, ఏఐసీటీఈ సైతం పచ్చజెండా ఊపింది. అయితే తీరా ఈ సీట్లకు రాష్ట్ర ప్రభుత్వం బ్రేక్‌లు వేసింది. ఆ తర్వాత ఒత్తిళ్లతో కొన్ని కాలేజీలకు అనుమతి ఇచ్చింది. దీం తో మిగతా కాలేజీల యాజమాన్యా లు హైకోర్టు, సుప్రీంకోర్టును సైతం ఆశ్రయించాయి.

**ఈ నెల 25 నుంచి దరఖాస్తులు..**

2025–26 విద్యాసంవత్సరంలో కాలేజీలు, కోర్సులకు అనుమతులిచ్చేందుకు ఇటీవలే ఏఐసీటీఈ షెడ్యూల్ విడుదల చేసింది. 25 నుంచి డిసెంబర్ 9 వరకు కాలేజీలకు దరఖాస్తు చేసుకునే అవకాశమిచ్చారు. పెనాల్టీతో జనవరి 18 నుంచి ఫిబ్రవరి 2 వరకు గడువు ఇచ్చారు. కాగా, ఫార్మసీ విధానాన్ని బీటెక్ కోర్సులకు వర్తింపజేయాలని ప్రభుత్వవర్గాలు అనుకుంటున్నట్టు తెలిసింది.

## చిన్న సైజు చేప పిల్లలు మాకొద్దు

- అధికారులను వెనక్కి పంపిన మత్స్యకారులు

అంతర్గాం, నవంబర్ 6 : 'ఈ చేప పిల్లలు మాకొద్దు' అంటూ పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం ఎల్లంపల్లిలో మత్స్యకారులు బుధవారం ఆందోళనకు దిగారు. మత్స్యశాఖ అధికారి నరేశ్ కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ రవి తెచ్చిన చేప పిల్లలు చిన్న సైజులో ఉండటంతో అడ్డుకొన్నారు. ఈ సైజు చేప పిల్లలతో ప్రయోజనం ఉండదని, వచ్చిన దారినే వెళ్లిపోవాలంటూ వెనక్కి పంపించారు.

## జాబితాపై అభిప్రాయాలు తెలపండి: సీఈవో

హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఓటర్ల నమోదుకు సంబంధించి గత నెల 29న విడుదల చేసిన జాబితాలపై అభ్యంతరాలుంటే తెలపాలని రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్‌ఆఫీసర్ (సీఈవో) సుదర్శన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సీఈవో కార్యాలయంలో బుధవారం పలు రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు.

# అనుమతులు ఇవ్వరు.. ఆదాయం పెంచరు

- హెచ్ఎండీఏలో పడకేసిన ప్లానింగ్
- నిలిచిన నిర్మాణ అనుమతులు
- రూ.50 కోట్లకు పడిపోయిన నెలవారీ రాబడి
- దరఖాస్తుల పెండింగ్‌తో ఖజానాకు చేరని ఆదాయం




హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 6(నమస్తే తెలంగాణ): అధికారుల నిర్లక్ష్యం, ప్రభుత్వ విధాన లోపంతో హైదరాబాద్ మహాభివృద్ధి సంస్థలో ఆదాయం పడిపోతున్నది. పదేండ్లపాటు హైదరాబాద్ వేదికగా రియల్ ఎస్టేట్ రంగం 3 హైరైజ్ ప్రాజెక్టులు, 6 అపార్టుమెంట్లు అన్న చందంగా గణనీయంగా వృద్ధి చెందింది. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కుప్పకూలింది. హెచ్ఎండీఏకు రావాల్సిన ఆదాయం క్రమంగా తగ్గిపోతున్నది. ఆదాయం తీసుకువచ్చే ప్లానింగ్ విభాగం ద్వారా నెలకు సగటున రూ.110 కోట్ల నుంచి రూ.150 కోట్ల మేర ఆదాయం సమకూరేది. కానీ గడచిన ఆరేడు నెలలుగా అనుమతులు నిలిచిపోవడంతో హెచ్ఎండీఏకు ఫీజుల రూపంలో రావాల్సిన ఆదాయానికి గండిపడుతున్నది. సకాలంలో అనుమతులు మంజూరు కాకపోవడం, హైడ్రా కూల్చివేతలు, మూసీ ప్రక్షాళన పేరిట కాంగ్రెస్ సర్కారు చేసిన డ్యామేజీ రియల్ ఎస్టేట్ రంగాన్ని కోలుకోలేని దెబ్బ కొట్టింది. హెచ్ఎండీఏ నెలవారీ ఆదాయం రూ.40 కోట్ల నుంచి రూ.50 కోట్లకు పడిపోయింది.

**మహా భాగ్యం.. మహా సంక్షోభం**

ఏడు జిల్లాల పరిధిలో విస్తరించిన హెచ్ఎండీఏకు నిర్మాణ రంగం ద్వారా ఆదాయం సమకూరేది. భవన నిర్మాణం, వెంచర్ అనుమతులతో ఫీజుల రూపంలో భారీ మొత్తంలో ఆదాయం వచ్చేది. ప్రాజెక్టు విస్తీర్ణాన్ని బట్టి ఒక్కో ప్రాజెక్టు మీద తక్కువలో తక్కువ కోటిన్నరకు పైగా రెవెన్యూ జనరేట్ అయ్యేది. ఈ లెక్కన ప్రతి నెలా అనుమతులు కోసం వచ్చే దరఖాస్తుల సంఖ్య 150–200కు పైగా ఉండేది. కానీ గడిచిన కొన్ని నెలలుగా రియల్ ఎస్టేట్ రంగంలో ఏర్పడిన స్తబ్ధత అనుమతుల కోసం వచ్చే దరఖాస్తులపై ప్రభావం చూపుతున్నది. అనుమతుల కోసం వచ్చే దరఖాస్తులు ఒక్కసారిగా 60శాతానికి పైగా పడిపోయాయి. హెచ్ఎండీఏ పరిధిలో డెవలప్‌మెంటల్ ఛార్జీల రూపంలో భారీగా వచ్చే ఆదాయం కూడా తగ్గింది.

**అసలే సంక్షోభం.. ఆపై నిర్లక్ష్యం**

రియాలిటీ రంగంలో ఏర్పడిన స్తబ్ధత కారణంగా మార్కెట్ మందగించింది. కానీ వచ్చిన దరఖాస్తులను కూడా అధికారులు పట్టించుకోవడం లేదు. సకాలంలో అనుమతులు ఇవ్వడానికి వెనుకడుగు వేస్తున్నారు. ఒకవేళ దరఖాస్తు చేసిన షార్ట్ ఫాల్స్ రూపంలో అధికారులు పెట్టే కొర్రీలతో దరఖాస్తుదారులు భయపడిపోతున్నారు. ఇక బడా ప్రాజెక్టులకు అయితే కింది స్థాయి అధికారుల ప్రమేయం లేకుండా నేరుగా ఉన్నతాధికారులు కనుసన్నల్లోనూ జరిగిపోతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా భారీ ఆదాయాన్ని తీసుకువచ్చే హైరైజ్ ప్రాజెక్టుల అనుమతు విషయంలో హెచ్ఎండీఏ తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నది. షెడ్యూల్ ప్రకారం జరగాల్సిన ఎంఎస్‌బీ సమావేశాలు సకాలంలో నిర్వహించడం లేదు. ఈ నేపథ్యంలో అనుమతులు నిలిచిపోయి, ప్రాజెక్టుల పేరిట వచ్చే రెవెన్యూ ఆగిపోతున్నది. బీఆర్ఎస్ హయాంలో టీఎస్‌బీపాస్ ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, వేగంగా అనుమతులు జారీ చేసే ప్రక్రియ ఉండేది. ఇప్పటికీ ఆన్‌లైన్ విధానంలోనే అనుమతులు జారీ చేస్తున్నా... సమాంతరంగా ఆఫ్‌లైన్ విధానంలో అనుమతులు మంజూరు చేస్తున్నట్టుగా తెలుస్తున్నది. దరఖాస్తు చేసి కూర్చుంటే నేరుగా అనుమతులు వచ్చే పరిస్థితి లేదని కొందరు బిల్డర్లు వాపోతున్నారు. ఆటోమోడ్ విధానాన్ని ప్రభుత్వం తొక్కి పెట్టడంతోనే అనుమతుల జారీలో జాప్యం జరుగుతున్నదని చెబుతున్నారు.

### గతమెంతో ఘనం.. నేడు గగనం

హెచ్ఎండీఏకు ఒకప్పుడు ప్రాజెక్టుల అనుమతుల ద్వారా నెలకు రూ.110 కోట్ల నుంచి రూ.150 కోట్లు సమకూరేది. ఓసారి రూ.200 కోట్లు కూడా వచ్చింది. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల నుంచి అధికంగా ఆదాయం వచ్చేది. ఇప్పుడు ఆదాయం సగానికి పైగా పడిపోయింది. నాలుగు నెలలుగా ఫీజుల రూపంలో వచ్చే రెవెన్యూ తగ్గిపోయింది. ప్రభుత్వ విధానాలే అత్యంత ప్రతికూలంగా మారినట్టు అధికారులు కూడా చెబుతున్నారు. కొత్త ప్రాజెక్టులు రాకపోవడంతోనే ఛార్జీల రూపంలో వచ్చే ఆదాయం తగ్గిందని ఓ సీనియర్ అధికారి అన్నారు.

## గుట్ట విమానగోపురానికి కళావరోహణం



యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయం దివ్య విమానగోపురం స్వర్ణ తాపడం పనుల్లో భాగంగా బుధవారం కళావరోహణం వైభవంగా నిర్వహించారు. దివ్య విమానగోపురంలోని సుదర్శన మహాచక్రంపై ఉన్న దేవతలను కలశంలోకి నిక్షిప్తం చేసి ఆలయంలో భద్రపరిచారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త బీ నరసింహమూర్తి, ఈవో భాస్కర్‌రావు, ప్రధానార్చకులు కాం దూరి వేంకటాచార్యులు పాల్గొన్నారు. – యాదగిరిగుట్ట

## కొలువుదీరిన టీటీడీ కొత్త పాలకమండలి

- 54వ చైర్మన్‌గా బీఆర్ నాయుడు బాధ్యతలు
- మరో 15 మంది సభ్యుల ప్రమాణ స్వీకారం



హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): తిరుమల తిరుపతి దేవస్థానం కొత్త పాలకమండలి కొలువుదీరింది. టీటీడీ 54వ ధర్మకర్త మండలి చైర్మన్‌గా బీఆర్ నాయుడు చైర్మన్‌గా, మరో 15 మంది సభ్యులుగా ధర్మకర్తల మండలి బాధ్యతలు చేపట్టారు. తిరుమల ఆలయ సంప్రదాయాలను పాటించి వరాహ స్వామిని ముందుగా దర్శించుకున్న బీఆర్ నాయుడు వైకుంఠం క్యూకాంప్లెక్స్ నుంచి శ్రీవారి సన్నిధికి చేరుకున్నారు. ఆలయ మహాద్వారం వద్ద టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరి స్వాగతం పలకగా, ఆలయంలోని బంగారు వాకిలి వద్ద టీటీడీ ఈవో శ్యామలరావు ఆయనచేత ప్రమాణం చేయించారు. చైర్మన్ దంపతులకు రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచనాలు అందజేయగా టీటీడీ ఈవో శ్యామల రావు స్వామి వారికి తీర్థ ప్రసాదాలను చిత్రపటాన్ని అందజేశారు.

**9న శ్రీవారి ఆర్జిత సేవలు రద్దు : టీటీడీ**

తిరుమలలో ఈ నెల 9న శ్రీవారి ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది. శ్రీవారికి పుష్పయాగ మహోత్సవం నిర్వహించనున్న నేపథ్యంలో కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, బ్రహ్మోత్సవ సేవలను రద్దు చేసినట్టు ప్రకటించింది. శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని మలయప్పస్వామికి పుష్పార్చన నిర్వహించనున్నారు.

## అరుణాచలం గిరిప్రదక్షిణకు టూర్ ప్యాకేజీ

హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): కార్తీకపౌర్ణమి సందర్భంగా తమిళనాడులోని అరుణాచలేశ్వరుడి గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల కోసం టీజీఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ప్రత్యేక టూర్ ప్యాకేజీని సంస్థ ప్రకటించింది. ఈ ప్యాకేజీలో కాణిపాకం వరసిద్ధివినాయక స్వామితో పాటు వెల్లూరులోని గోల్డెన్‌టెంపుల్‌ను సందర్శించే సౌకర్యాన్ని సంస్థ కల్పిస్తున్నది.ఈ నెల 15న కార్తీకపౌర్ణమి కాగా.. 13 నుంచి ఈ ప్రత్యేక బస్సులు బయల్దేరుతాయి. అరుణాచలగిరి ప్రదక్షిణ టూర్ ప్యాకేజీని http//tgsrtcbus.inవెబ్‌సైట్‌లో బుక్ చేసుకోవచ్చు. శ్రీశైలం,వేములవాడ, ధర్మపురి, కీసరగుట్ట తదితర ఆలయాలకు స్పెషల్ బస్సులను నడిపిస్తున్నట్టు ఎండీ సజ్జనార్ పేర్కొన్నారు. ఇక దీపావళి సందర్భంగా టికెట్ ధరలను జీవో ప్రకారం సవరించినట్టు స్పష్టంచేశారు.

## సైబర్ నేరాలపై వృద్ధులకు అవగాహన

హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): సైబర్ నేరాల్లో అత్యధిక శాతం బాధితులు వృద్ధులే కావడంతో.. సైబర్ సెక్యూరిటీ బ్యూరో 'జాగరూక్ సీనియర్ సిటిజన్ దివస్' అనే అవగాహన కార్యక్రమాన్ని చేపట్టిం ది. దేశవ్యాప్తంగా ప్రారంభమైన కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో వివిధ సీనియర్ సిటిజన్ సంఘాలు, జిల్లా సమన్వయ కమిటీల ద్వారా సైబర్ నేరాలపై అవగాహన కల్పించింది. సంఘాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 30 మంది సీనియర్ సిటిజన్లను ఆహ్వానించి సైబర్ స్కామ్‌ను గుర్తించడం, నేరస్తుల నుంచి తమను తాము రక్షించుకోవడంపై వివరించారు. అనంతరం సీఎస్‌బీ డీజీ శిఖాగోయెల్ ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు.

# పులిచింతల ఉండగా శ్రీశైలం ఎందుకు?

- జూరాలపై షరతులు ఎలా విధిస్తారు?
- ఏపీ వాదనలపై తెలంగాణ ప్రశ్నలు
- కృష్ణా ట్రిబ్యునల్‌లో విచారణ ప్రారంభం

హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): కృష్ణా డెల్టాకు శ్రీశైలం నుంచి సాగునీటిని అందించాల్సిన అవసరం లేదని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. కృష్ణా డెల్టాకు నాగార్జునసాగర్ దిగువ జలాలు సరిపోతాయని, అందుకోసమే పులిచింతల ప్రాజెక్టును నిర్మించారని పేర్కొంటూ.. జూరాల నీటి వినియోగంపై షరతులు పెట్టడం కుదరని జస్టిస్ బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్‌కు తెలిపింది. తెలంగాణ, ఏపీ మధ్య కొనసాగుతున్న కృష్ణా జలాల వివాదంపై అంతరాష్ట్ర నదీ వివాదాల చట్టం–1956లోని సెక్షన్–3 ప్రకారం విచారణ జరపాలని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన 1,005 టీఎంసీలు, గోదావరి డైవర్షన్ ద్వారా వచ్చే 45 టీఎంసీలు కలిపి మొత్తం 1,050 టీఎంసీల జలాలను రెండు రాష్ట్రాల మధ్య పునఃపంపిణీ చేయడంతోపాటు ప్రాజెక్టుల వారీగా నీటిని కేటాయించాలని పేర్కొంటూ కేంద్ర ప్రభుత్వం నిరుడు అక్టోబర్‌లో నూతన మార్గదర్శకాలను జారీ చేసిన విషయం విదితమే. ఆ విచారణకు సంబంధించి ఇరు రాష్ట్రాలు ఇప్పటికే ఎస్‌వోసీని (స్టేట్‌మెంట్ ఆఫ్ కేస్)లను సమర్పించాయి. విచారణ అంశాల జాబితా కూడా ఇప్పటికే సిద్ధమైంది. అయితే, ఆపరేషన్ ప్రొటోకాల్ అంశాన్ని మాత్రమే సాక్షుల ద్వారా విచారించాలని ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించడంతోపాటు అఫిడవిట్‌ను కూడా దాఖలు చేసింది. దీనిపై బుధవారం ఢిల్లీలో జస్టిస్ బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ ఎదుట క్రాస్ ఎగ్జామినేషన్ ప్రారంభమైంది. ఏపీ తరపున అనిల్ కుమార్ గోయెల్‌ను, తెలంగాణ తరపున సీనియర్ అడ్వకేట్ వైద్యనాథన్‌ను క్రాస్ ఎగ్జామిన్ చేశారు. ప్రాజెక్టుల ఆపరేషన్ ప్రొటోకాల్, జూరాల వద్ద నీటి వినియోగంపై నియంత్రణ విధించాలని, పోలవరం నుంచి గోదావరి డైవర్షన్ ద్వారా వచ్చే 45 టీఎంసీలు తదితర అంశాలపై అనిల్ కుమార్ గోయెల్ తన అఫిడవిట్‌లో లేవనెత్తిన అంశాలపై వైద్యనాథన్ పలు ప్రశ్నలు సంధించారు. కృష్ణా జలాలను ప్రాజెక్టులవారీగా కాకుండా గంపగుత్తగా వినియోగించుకునే విధంగా ట్రిబ్యునల్–1 కేటాయించిందని, దీన్ని సుప్రీంకోర్టు సైతం నిర్ధారించిందని గుర్తుచేశారు. జూరాల వద్ద కేవలం 37.84 టీఎంసీలను వినియోగించుకునేలా తెలంగాణను నియంత్రించాలని, ఆ మేరకు షరతులు విధించాలని ఏపీ చేసిన వాదనను నిర్ద్వంద్వంగా తోసిపుచ్చారు. తెలంగాణలోని నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ తదితర ప్రాజెక్టులు జూరాలపై ఆధారపడి ఉన్నందున అక్కడ నీటివినియోగంపై నియంత్రణ కుదరదని తేల్చిచెప్పారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి కృష్ణా డెల్టాకు సాగునీటిని సరఫరా చేయాల్సిన అవసరం లేదని పేర్కొంటూ.. నాగార్జునసాగర్ దిగువన క్యాచ్‌మెంట్ ఏరియాలో జనరేట్ జలాలను పులిచింతల, ప్రకాశం బరాజ్ ద్వారా ఏపీ వినియోగించుకుంటున్నదని వైద్యనాథన్ తెలిపారు. ఈ క్రాస్ ఎగ్జామినేషన్ గురువారం కూడా కొనసాగనున్నది.

## విద్యావేత్త విజయ్‌కుమార్ సస్పెన్షన్ హేయం

**హరగోపాల్**



హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): నిర్మల్‌లోని ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు, ప్రజాపక్ష విద్యావేత్త ఆరేపల్లి విజయ్‌కుమార్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేయడం హేయమైన చర్య అని తెలంగాణ పీపుల్స్ జేఏసీ కన్వీనర్ ప్రొఫెసర్ హరగోపాల్ మండిపడ్డారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సస్పెన్షన్‌ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇథనాల్ కంపెనీకి వ్యతిరేకంగా ప్రజలు పోరాటం చేస్తుండగా, విజయ్‌కుమార్ వారికి మద్దతుగా నిలిచారని చెప్పారు. ఇది సహించని సదరు కంపెనీ ప్రభుత్వ అధికారులపై ఒత్తిడి తెచ్చి, ఈ చర్యలకు పాల్పడిందని మండిపడ్డారు.



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి తదితరులు

# గవర్నర్‌తో సీఎం రేవంత్ భేటీ

హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో భేటీ అయ్యారు. ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే వివరాలను ఆయన గవర్నర్‌కు వివరించారు. 2025లో కేంద్రం చేపట్టే జనగణనకు ఈ సర్వేను పరిగణనలోకి తీసుకునే అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అనంతరం తన సోదరుడి కుమార్తె వివాహానికి హాజరు కావాలని గవర్నర్‌ను ఆహ్వానించారు. రేవంత్ వెంట మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, బలరాంనాయక్, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, షబ్బీర్ అలీ, కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# శ్రీశైలంలో రికార్డు స్థాయి విద్యుత్తు ఉత్పత్తి

### ఎడమగట్టు జలవిద్యుత్తు కేంద్రంలో 1,646 మి.యూ



సీఈ రామసుబ్బారెడ్డి

దోమలపెంట, నవంబర్ 6: శ్రీశైలం ఎడమగట్టు జలవిద్యుత్తు కేంద్రంలో రికార్డు స్థాయి విద్యుత్తు ఉత్పత్తి చేసినట్టు సీఈ రామసుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈసారి వరదలు భారీగా రావడంతో టార్గెట్‌ను దాటి 1,646 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి జరిగిందని, జనవరి వరకు మరింత ఉత్పత్తి చేసే అవకాశం ఉందని చెప్పారు. అధికారులు, ఉద్యోగులు, కార్మికుల కృషితోనే ఈ రికార్డు సృష్టించామని పేర్కొన్నారు. ఎడమగట్టు కేంద్రంలోని నాలుగో యూనిట్ మరమ్మతు పనులు కొనసాగుతున్నాయని, మిగిలిన ఐదు యూనిట్ల ద్వారా 750 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తున్నామని వివరించారు. నిత్యం 37,500 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ ఐదు యూనిట్లలో 15 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్నట్టు తెలిపారు.

## స్పీకర్ విధులపై న్యాయ సమీక్షకు వీల్లేదు

హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ తరపున ఎన్నికై కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించిన ఎమ్మెల్యేల వ్యవహారంపై ప్రస్తుతం న్యాయ సమీక్షకు ఆస్కారం లేదని, ఈ అంశంపై అసెంబ్లీ స్పీకర్ తుది నిర్ణయం తీసుకున్న తర్వాతే న్యాయ సమీక్షకు వీలుంటుందని ఫిరాయింపుదారుల తరపు న్యాయవాదులు హైకోర్టులో వాదించారు. ఫిరాయింపుదారులపై అనర్హత వేటు వేయాలన్న పిటిషన్లపై ఫలానా తేదీలోగా విచారణ పూర్తి చేయాలంటూ స్పీకర్‌ను ఆదేశించే అధికారం కోర్టులకు లేదని చెప్పారు. ఇప్పుడు సింగిల్ జడ్జి ఉత్తర్వులను ఆమోదిస్తే రేపు చట్టసభలో స్పీకర్ ఏవిధంగా నిర్ణయాలు తీసుకోవాలో కోర్టులే ఆదేశించొచ్చని పేర్కొన్నారు. గురువారం కూడా ఈ వాదనలు కొనసాగనున్నాయి.

## మెడికల్ పీజీ 'స్థానికత'పై వివరణ ఇవ్వండి: హైకోర్టు

హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): మెడికల్ పోస్ట్ గ్రాడ్యుయేట్ సీట్ల భర్తీలో 'స్థానికత' వివాదంపై వివరణ ఇవ్వాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ నెల 12న తదుపరి విచారణ చేపడతామని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం స్పష్టంచేసింది. ఆలోగా కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ బుధవారం నోటీసులు జారీ చేసింది.



పోలేపల్లి శివారులోని సెజ్‌లో జేసీబీ సాయంతో ఫాంపాండ్స్ పూడ్చివేత

# సెజ్‌లో ఫాంపాండ్స్ పూడ్చివేత

### లోకాయుక్త ఆగ్రహంతో స్పందించిన రెవెన్యూ అధికారులు

జడ్చర్ల, నవంబర్ 6: మహబూబ్‌నగర్ జిల్లా పోలేపల్లి శివారులోని సెజ్‌లో ఫాంపాండ్స్‌ను బుధవారం రెవెన్యూ అధికారులు పూడ్చివేశారు. ఉచిత విద్యుత్తును వినియోగిస్తూ.. భూగర్భ జలాలను కొల్లగొడుతూ వ్యవసాయ బోరుబావుల నుంచి సెజ్‌లోని పరిశ్రమలకు ట్యాంకర్లతో నీటిని తరలిస్తున్నారన్న ఫిర్యాదుతో మంగళవారం లోకాయుక్త అధికారులు పర్యటించారు. పోలేపల్లితోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో పర్యటించి నీటిని సరఫరా చేసే బోర్లను గుర్తించారు. రెవెన్యూ, విద్యుత్తు అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేయడంతో బుధవారం వారు జేసీబీ సహాయంతో ఫాంపాండ్స్‌ను పూడ్చివేయించారు.

## దివ్యాంగుల సమస్యలపై రాష్ట్రవ్యాప్త పోరు: కొల్లి

హైదరాబాద్, నవంబర్6 (నమస్తే తెలంగాణ): దివ్యాంగుల సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు తెలిపారు. హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించిన వేదిక ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల హామీ మేరకు దివ్యాంగుల ఆసరా పింఛన్ సొమ్మును పెంచాలని, బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు.

## ఈనెల 30లోగా లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలి

హైదరాబాద్, నవంబర్ 6(నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లు ఏటా సమర్పించే డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ల దాఖలుకు ఈ నెల 30వ వరకు గడువు విధించారు. దేశవ్యాప్తంగా డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ విధానాన్ని అమలు చేస్తున్నారు. రైల్వే మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ఎస్‌సీఆర్ ఆధ్వర్యంలో పెన్షనర్ల సంక్షేమ శాఖ సహకారంతో ఈ నెల 30 వరకు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ల దాఖలుపై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు.

## హౌసింగ్ సొసైటీలకు ఇండ్ల స్థలాలిప్పిస్తాం

### ఉద్యోగ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్

హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ) : భాగ్యనగర్ టీఎన్జీవో–గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ సభ్యులకు ఇండ్ల స్థలాలు ఇప్పించేందుకు కృషిచేస్తామని ఉద్యోగ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ ప్రకటించారు. ప్రభుత్వం ఈ విషయంలో సానుకూలంగా ఉన్నదని, త్వరలో ఇండ్ల స్థలాలిప్పిస్తామని భరోసా కల్పించారు. భాగ్యనగర్ టీఎన్జీవోస్ గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశాన్ని సొసైటీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణగౌడ్ అధ్యక్షతన బుధవారం ఆర్టీసీ కల్యాణ మండపంలో నిర్వహించారు.

## హైదరాబాద్‌లో 100 అడుగుల ఎన్టీఆర్ విగ్రహం

### టీడీపీ నాయకుడు టీడీ జనార్దన్

హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తేతెలంగాణ): హైదరాబాద్‌లో 100 అడుగుల ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటుచేస్తామని టీడీపీ నాయకుడు టీడీ జనార్దన్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ టీడీపీని స్థాపించిన చోటే ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని చెప్పారు.